గరిష్ట ఉష్ణోగ్రత 45 డిగ్రీల నమోదు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలో ఈ ఏడాది రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. శుక్రవారం రికార్డు స్థాయిలో 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఏప్రిల్ మొదటి వారంలోనే ఉష్ణోగ్రతలు అత్యధిక స్థాయిలో నమోదు కావడం, దీనికి తోడు వడగాల్పులు వీయడంతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో వేడిమి తాళలేక రోడ్లపైకి జనం వచ్చేందుకు భయపడుతున్నారు.

కురుపాం, అరకు స్థానాల్లో సిపిఎం పోటీ

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం

- కురుపాం అభ్యర్థిగా మండంగి రమణ, అరకు పార్లమెంటు అభ్యర్థిగా అప్పలనర్స
- బిజెపి తొత్తు, పొత్తు పార్టీలను ఓడించండి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం
- 22న రమణ నామినేషన్

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

అరకు పార్లమెంట్, కురుపాం అసెంబ్లీ స్థానాల్లో సిపిఎం అభ్యర్థులు పోటీ చేస్తారని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం ప్రకటించారు. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మతో కలిసి ఆయన శుక్రవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. అరకు పార్లమెంట్ స్థానం నుంచి పి.అప్పలనర్స, కురుపాం అసెంబ్లీ స్థానం నుంచి మండంగి రమణను అభ్యర్థులుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. కురుపాం అభ్యర్థి రమణ ఈ నెల 22న నామినేషన్ దాఖలు చేస్తారని ప్రకటించారు. బిజెపి రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేసిందన్నారు. రాజధాని నిధులు మళ్లింపు, ప్రత్యేక హోదా, ఉత్తరాంధ్ర రాయలసీమ ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీలు ఇవ్వలేదని తెలిపారు. గిరిజన యూనివర్సిటీ నిర్మాణం చేయకుండా గిరిజన విద్యార్థులతో చెలగాటమాడుతోందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కార్మికులు పోరాటం చేస్తున్నా కనీసం పట్టించుకోవడం లేదని గుర్తు చేశారు. స్టీల్ ప్లాంట్‌కు ముడి సరుకులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతూ వాటి ఆస్తులను ప్రయివేటుపరం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి ఇంత అన్యాయం చేసిన బిజెపితో టిడిపి, జనసేన కూటమి కట్టడం రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేయడమేనని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఈ ఐదేళ్లలో రాష్ట్ర ప్రయోజనాల కన్నా బిజెపి ప్రయోజనాలకే అధిక ప్రాధాన్యత ఇచ్చిందని విమర్శించారు. కార్మిక చట్టాల్లో మార్పు, ప్రభుత్వ పరిశ్రమల ప్రయివేటీరణకు పూర్తి సహాయ సహకారాలు అందించిందని తెలిపారు. రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న బిజెపిని, ఆ పార్టీతో పొత్తు పెట్టుకున్న టిడిపి, జనసేనను, తొత్తుగా వ్యవహరిస్తున్న వైసిపిని ఓడించాలని పిలుపునిచ్చారు. సిపిఎం తరపున పోటీ చేయనున్న అప్పలనర్స, మండంగి రమణ గిరిజన సమస్యలపై నిరంతరం పోరాడుతున్నారని తెలిపారు. గిరిజన, మధ్య తరగతి ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడే సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం విద్య రంగాన్ని కాషాయికరణ చేయడం దుర్మార్గమని అన్నారు. రాష్ట్రాల హక్కులను హరించి కార్పొరేట్లకు బిజెపి తాకట్టు పెడుతోందన్నారు. విద్యుత్ రాష్ట్రం హక్కు కాగా, దాన్ని కేంద్రం స్వాధీనం చేసుకొని ఉచిత విద్యుత్తు, సబ్సిడీలు లేకుండా చేస్తుందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని పూర్తిగా మార్చేస్తామని బిజెపి బహిరంగంగానే ప్రకటించిందని అన్నారు. మరోసారి బిజెపి అధికారం చేపడితే బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీల రిజర్వేషన్లు పోతాయని, భూ హక్కు చట్టం కూడా రద్దు అవుతుందని అన్నారు. కాబట్టి బిజెపిని, దానితో కలిసి ఎన్నికల్లో పోటీ చేసే టిడిపి, జనసేనలను, పరోక్షంగా సహకరించే వైసిపిని ఓడించాలని కోరారు. కురుపాం అసెంబ్లీ స్థానంలో రమణను, ఎంపి పార్లమెంట్ అభ్యర్థి అప్పలనర్సను గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశం లో పార్టీ జిల్లా కార్యదర్శి రెడ్డివేణు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.అవినాష్, వై.మన్మథరావు, కొల్లి గంగునాయుడు పాల్గొన్నారు.

మండంగి రమణ బయోడేటా

పేరు : మండంగి రమణ
వయస్సు : 51
చదువు : 10వ తరగతి
తల్లిదండ్రులు : మండంగి దుబల (లేటు), మండంగి సత్తారి
భార్య : మండంగి నరసమ్మ
పిల్లలు : ఇద్దరు కుమారులు. వెంకట కిశోర్, తేజ
స్వస్థలం : సవరకోటపాడు, గుమ్మలక్ష్మీపురం మండలం
సామాజిక తరగతి : గిరిజన సవర
కుటుంబ నేపథ్యం : వ్యవసాయ కూలీ కుటుంబం
పార్టీలో ప్రస్థావన : 1990లో గిరిజన సంఘంతో పరిచయం. 1994లో సిపిఎంలో చేరిక. పలు పోరాటాల్లో అరెస్టులు, విడుదల
ప్రస్తుత హోదాలు : చెముడుగూడ ఎంపిటిసి సభ్యుడు. పార్టీ మండల కమిటీ సభ్యులు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కోశాధికారి
ప్రజాప్రతినిధి అనుభవం : రెండుసార్లు సర్పంచ్‌గా, 2సార్లు ఎంపిటిసి సభ్యుడిగా ఎన్నిక
గతంలో నిర్వహించిన బాధ్యతలు : గిరిజన సంఘం ఉమ్మడి జిల్లా కమిటీ సభ్యులు, జిల్లా అధ్యక్షులు, గౌరవాధ్యక్షులు, రాష్ట్ర కమిటీ సభ్యులు
ప్రధాన ఆందోళనలు, పోరాటాలు : స్థానికంగా సాగునీటి చెక్‌డామ్‌ల సాధనకు పోరాటం, గిరిజన ఉత్పత్తుల గిట్టుబాటు ధరల కోసం పోరాటం, అటవీ పోడు పట్టాల కోసం ఉద్యమం, జీవో 3 పునరుద్ధరణ పోరాటం, 1/70 అమలు పోరాటం, ఉద్యమాల్లో పాల్గొనడం. నాయకత్వం వహించడం.

ఆదివాసీలపై అంతులేని నిర్లక్ష్యం

- ఏళ్ల తరబడి మౌలిక సౌకర్యాలకు దూరం
- వైసిపి, టిడిపి దొందూ దొందే
- గిరిజన సమస్యలపై సిపిఎం పోరాటం

నాగరకుంటుబాయి గెడ్డ వద్ద డోలిమోతతో రోగిని తీసుకెళ్తున్న గిరిజనులు (ఫైల్ ఫొటో)

ఏజెన్సీలో గిరిజనుల సమగ్రాభివృద్ధి అందని ద్రాక్షగానే మిగిలింది. ఏళ్ల తరబడి గిరోడ్డు రవాణా, తాగునీరు, వైద్యం వంటి మౌలిక సౌకర్యాలు అందని ద్రాక్షగా ఉన్నాయి. ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో గిరిజనులు వెనుకబడే ఉన్నారు. మారుమూల ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాలు మెరుగుపడకపోవడం వల్ల చావు బతుకుల మధ్య జీవన మనుగడ సాగిస్తున్నారు. గెడ్డలు, వాగులు దాటి కొండలు ఎక్కి డోలిమోతలతో వైద్యం కోసం ఆస్పత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి నేటికీ ఉంది. తరతరాలుగా సమస్యలతోనే సహవాసం చేస్తున్నారు. గిరిజనుల సమస్యలను పరిష్కరించని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై సిపిఎం ఆధ్వర్యాన పోరాటాలు చేస్తున్నారు.

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని పెదగొత్తిలి పంచాయతీలో గల నాగార కుంటుబాయిలో 36 గిరిజన కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ గ్రామానికి ప్రధాన రహదారికి మధ్య మూడు కిలోమీటర్ల దూరం ఉంది. సరైన రహదారి సౌకర్యం, వంతెన లేక అత్యవసర పరిస్థితుల్లో అనారోగ్యానికి గురైతే డోలిమోతే వారికి గతి. ఇక్కడ 120 మంది గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. నిత్యావసర వస్తువులు, డిపో నుంచి రేషన్ తెచ్చుకోవాలంటే గెడ్డ దాటి వెళ్లాల్సిందేనని ఆ గ్రామ గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో గెడ్డలో నీరు అధికంగా చేరడంతో ఏ క్షణం ఏమవుతుందోనని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఆ గెడ్డలో ముగ్గురు గల్లంతయ్యారని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఎవరైనా అనారోగ్యం పాలైతే 108 వాహనం గ్రామానికి రాలేని పరిస్థితి నెలకొందని, సుమారు 2 కిలోమీటర్ల దూరం డోలితో మోసుకొని గెడ్డ దాటాల్సి పరిస్థితి వస్తుందని తెలిపారు. అలాగే తమ పిల్లలు పాఠశాలకు వెళ్లాలంటే భుజాన మోసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని తల్లిదండ్రులు వాపోతున్నారు. తమ ఇబ్బందులను అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోకపోవడం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా తమను పట్టించుకునే నాధుడేలేడని, తమ బాధల్ని ఎవరితో చెప్పుకోవాలో తెలియని పరిస్థితుల్లో ఉన్నామని అక్కడ గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి నాగరకుంటుబాయికి రహదారి వేసి, వంతెన నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిత్యావసరాల కోసం గెడ్డ దాటి వెళ్తున్న గిరిజన మహిళలు (ఫైల్ ఫోటో)

సమస్యల వలయంలో మా గ్రామం

పెదగొత్తిలి పంచాయతీలో గల నాగార కుంటుబాయి గిరిజన గ్రామం మాది దశాబ్దాల కాలం నుంచి 36 గిరిజన కుటుంబాలు 120 మంది ప్రజలు జీవిస్తున్నాం. మా గ్రామానికి రహదారి సౌకర్యం, వంతెన లేక అత్యవసర పరిస్థితుల్లో అనారోగ్యానికి గురైతే డోలిమోతే గత అవుతుంది వర్షాకాలంలో వర్షాలు ఎక్కువ పడిన సందర్భంలో ఆరోగ్యం బాగోలేని వారిని గెడ్డ దాటించలేక ప్రాణాలు విడిచే సంఘటన ఎన్నో జరిగాయి. నిత్యావసర వస్తువులు, డిపో నుంచి రేషన్ తెచ్చుకోవాలన్న మధ్యలో ఉన్న గెడ్డ దాటి వెళ్లి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటు సమస్యలతో జీవనం సాగిస్తున్నాం.

తిమ్మక బాలరాజు,
నాగర కుంటుబాయి

హామీలే తప్ప ని అమలుకు నోచని పరిస్థితి

ఎన్నికల ముందు అన్ని పార్టీలు, నాయకులు రావడం ఎన్నికల అనంతరం గెడ్డ వద్ద వంతెన, రహదారి మంజూరు చేయిస్తామని హామీలు ఇవ్వడమే తప్ప అమలుకు నోచుకునే పరిస్థితి దశాబ్దాల కాలం నుం లేదు. నేను స్వయంగా ఆ గ్రామ ప్రజలను తీసుకుని ఐటిడిఉ అధికారులకు వద్దకు వెళ్ళి ఎన్నోసార్లు వినతులు అందించాం. కానీ అధికారులు కూడా స్పందించే దాఖలాల్లేవు. తమ ఇబ్బందులను అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు చెప్పినా స్పందించలేదు. అంటే గిరిజన సమస్యలు వారికి అంతు పట్టవు. ప్రభుత్వాలు మారిన అధికారులు మారిన గిరిజనం తలరాతలు ఎప్పటికీ మారవు.

టి.లోకనాదం
సర్పంచ్ పెద గొత్తిలి పంచాయతీ.

జగ్జీవన్‌రామ్‌కు నివాళ్లు అర్పిస్తున్న జాయింట్ కలెక్టర్ శోబిక, డిఆర్‌ఒ కేశవనాయుడు, ఇతర అధికారులు

కలెక్టరేట్‌లో జగ్జీవన్‌రామ్‌కు నివాళి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

బాబూ జగ్జీవన్ రామ్ 117వ జయంతి సందర్భంగా స్థానిక కలెక్టరేట్‌లో అధికారులు ఘన నివాళ్లు అర్పించారు. జిల్లా షెడ్యూలు కులాల సంక్షేమం, సాధికారిత శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోబిక జ్యోతి ప్రజ్వలన చేసి బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. బాబూ జగ్జీవన్ రామ్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డిఆర్ఒ జి.కేశవనాయుడు, జిల్లా షెడ్యూలు కులాల సంక్షేమం, సాధికారిత అధికారి గయాజుద్దీన్, జిల్లా మత్స్య శాఖ అధికారి తిరుపతయ్య, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి ప్రచారహోరు... ఇంకా తేలని కూటమి అభ్యర్థి

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. అయితే పది రోజుల క్రితమే వైసిపి అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే కళావతి పేరు ప్రకటించారు. కానీ కూటమి తరుపున ఇంతవరకూ అభ్యర్థిని ప్రకటించలేదు. మొదట్లో తెలుగుదేశం పార్టీకి టికెట్ కేటాయిస్తారని అంతా భావించారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణతో పాటు పడాల భూదేవి, మరి కొంతమంది టికెట్ ఆశించడం పార్టీలో గ్రూపులు ఎక్కువుండడంతో ఈ సీటు పొత్తులో భాగంగా జనసేనకు కేటాయిస్తారని ప్రచారంలోకి వచ్చింది. దీంతో తెలుగుదేశం తరఫున టికెట్ ఆశించిన పడాల భూదేవి స్థానిక నాయకులతో కలిసి పవన్ కల్యాణ్‌ను కలిశారు. అయితే కొద్ది రోజుల క్రితమే జయకృష్ణ పవన్ కల్యాణ్ సమక్షంలోనే జనసేన కండువా కప్పుకున్నారు. దీంతో జనసేన టికెట్ జయకృష్ణకు కేటాయిస్తారని వార్తలు వినిపించాయి. అయితే ఇంతవరకు అభ్యర్థిని ప్రకటించక పోవడంతో ఇటు టిడిపి, అటు జనసేన కేడర్ డీలా పడుతుంది. వైసిపి అభ్యర్థి కళావతి ప్రచారం మొదలుపెట్టి గ్రామాల్లో తిరుగుతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న అభ్యర్థి ప్రకటనలో ఎందుకు జాప్యం చేస్తున్నారో తెలియడం లేదని రాజకీయ వర్గాల్లో చర్చ వినిపిస్తుంది.

మొదలైన అసంతృప్తి

జనసేన టికెట్ కేటాయింపుపై ఆ పార్టీలో అసంతృప్తి సెగలు మొదలయ్యాయి. పొత్తులో భాగంగా పాలకొండ సీటు జనసేనకు కేటాయిస్తారనే ప్రచారం రావడంతో టిడిపిలో టికెట్ ఆశిస్తున్న వారంతా జనసేన వైపు తిరిగారు. మొన్నటి వరకు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా ఉన్న నిమ్మక జయకృష్ణ జనసేన కండువా కప్పుకోగా, స్థానిక తెలుగుదేశం నాయకులు టికెట్ ఆశిస్తున్న పడాల భూదేవి కూడా పవన్ కల్యాణ్‌ను కలవడంతో టిడిపి టికెట్ రేసులో ఉన్న వారికే జనసేన టికెట్ వస్తుందని నియోజకవర్గంలో ప్రచారం జరుగుతుంది. అయితే పార్టీలో కొంతమంది దీన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలుస్తుంది. అందుకు బుధవారం మాజీ జెడ్పీటిసి సభ్యులు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నిమ్మల నిబ్రహం కొండ వీధులో ప్రెస్-మీట్ ఏర్పాటు చేసి తమకు పార్టీలో ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆరోపించారు. తెలుగుదేశం పార్టీలో జయకృష్ణకు టికెట్ ఇస్తే ఒక గ్రూపు చేయరని, భూదేవికి టికెట్ ఇస్తే మరో గ్రూపు వ్యతిరేకిస్తారని బహిరంగ చర్చ జరుగుతుంది. ఈ పరిస్థితిలో జనసేన వారిద్దరో ఎవరికి టికెట్ ఇచ్చినా ఇదే పరిస్థితి వస్తుందని అన్నారు.

కోడ్ అతిక్రమించినందుకు నోటీసులు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని కిచ్చాడతో పాటు పలు గ్రామాల్లో శుక్రవారం వైసిపి నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఎన్నికల కోడ్ అతిక్రమించారని అధికారులు నోటీసులు జారీచేశారు. ప్రచారంలో లౌడ్ స్పీకర్, జెండాలు, తోరణాలకు అనుమతులు పొందినప్పటికీ ప్రభుత్వ ఆస్తులు (కరెంటు స్తంభాలు)కు సదరు జెండాలు, తోరణాలు, కట్టి ప్రదర్శించడం వల్ల ఎన్నికల కోడ్ అతిక్రమించారని వచ్చిన ఫిర్యాదుకు వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజుకు తగు వివరణ కోరుతూ కురుపాం రిటర్నింగ్ అధికారి వి.వి.రమణ నోటీసులు జారీచేశారు.

దేవాదాయ శాఖ దోబూచులాట

- ఆలస్యంగా స్పందించిన అధికారులు
- డీలక్స్ స్థలం తమదేనని నోటీసు బోర్డు
- మ్యుటేషన్ చేసిన మున్సిపల్ అధికారులకు షాక్

ప్రజాశక్తి - సాలూరు

జిల్లా దేవాదాయశాఖ అధికారులు దోబూచులాట ఆడుతున్నారు. దేవాదాయ శాఖ పరిధిలో ఆలయాల ఆస్తులు ఎక్కడెక్కడ, ఎంతెంత ఉన్నాయో వారికే స్పష్టత లేదు. ఆస్తులు ఫలానా ఆలయానికి చెందినవని ఆధారాలు చూపించినా వాటిని స్వాధీనం చేసుకోవడానికి స్పందించడం లేదు. ఇతరుల ఆక్రమణలో ఉన్న ఆస్తులు గానీ, చట్టవిరుద్ధంగా అమ్మకం చేసిన వారిపై చర్యలు తీసుకొనేందుకు గానీ వారు ముందుకు రాని పరిస్థితి నెలకొంది. శతాబ్దాల క్రితం దేవాలయాల ధూపదీప నైవేద్యాల కోసం కొంతమంది దాతలు ఇచ్చిన భూములు ఇప్పుడు అన్యాక్రాంతమయ్యే పరిస్థితి ఏర్పడింది. ఫలానా చోట దేవాదాయ శాఖకు చెందిన భూమిని కైంకర్యం చేస్తున్నారని ఫిర్యాదు చేసినా వారు సకాలంలో స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఆక్రమణదారులు, కబ్జాదారులతో కుమ్మక్కై ముడుపులు తీసుకోవడం వల్లే అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. పట్టణంలోని శ్రీ సువర్చలా సహిత ఆంజనేయస్వామి వారి ఆలయానికి చెందిన కోట్ల విలువైన భూమి పట్టణ నడిబొడ్డున వుంది. సర్వే నెంబర్ 159/2లో ఉన్న వెంకటేశ్వరా డీలక్స్ స్థలం, దాని పక్కనే ఉన్న రేకుల షెడ్ స్థలం సువర్చలా సహిత ఆంజనేయస్వామి వారి ఆలయానికి చెందినవేనని గతంలో ఉమ్మడి జిల్లా దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వులు ప్రకారం కొత్తగా ఏర్పడిన మన్యం జిల్లా దేవాదాయశాఖ అధికారులు ఆలయం ఆస్తిని కాపాడుకోవడానికి చర్యలు తీసుకోవాలి. కానీ ఆ దిశగా వారు అడుగులు వేస్తున్నట్లు కనిపించడం లేదు. ఈ ఆలయానికి చెందిన రేకులు షెడ్ స్థలాన్ని 2019 నవంబర్‌లో పట్టణానికి చెందిన కొంతమంది వ్యాపారులు కొనుగోలు చేశారు. వెంకటేశ్వరా డీలక్స్ స్థలాన్ని కూడా అదే వ్యాపారులు 2021 నవంబర్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. దేవాదాయ శాఖకు చెందిన స్థలాలను రిజిస్ట్రేషన్ చేయొద్దని అభ్యంతరాలు వ్యక్తం చేసినా అప్పటి రిజిస్ట్రేషన్ అధికారులు చేసేశారు. ఆలయ ధర్మకర్తగా ఉన్న విక్రమ చంద్ర సన్యాసి రాజు కుటుంబీకులు 1.17 ఎకరాల భూమిని విక్రయించారు. మార్కెట్ విలువ ప్రకారం ఈ స్థలం సుమారు రూ.పది కోట్ల వరకు వుంటుంది. ఇంతటి విలువైన ఆస్తిని కాపాడుకోవడంలో దేవాదాయ శాఖ అధికారులు ఘోరంగా విఫలమవుతున్నారు. పట్టణంలోని వడ్డి వీధి రామమందిరానికి చెందిన భూములు కూడా అన్యాక్రాంతమవుతున్నా దేవాదాయ శాఖ అధికారులు చోద్యం చూస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. డీలక్స్ స్థలం, పక్కన ఉన్న రేకుల షెడ్ స్థలం తమదేనని శుక్రవారం ఉదయం దేవాదాయశాఖ ఇఒ రమేష్ నోటీసు బోర్డులు ఏర్పాటు చేశారు. దొంగలు పడిన ఆరు నెలల కు కుక్కలు మొరిగిన చందంగా దేవాదాయ అధికారులు ఇప్పుడు శ్రీ సువర్చలా సహిత ఆంజనేయస్వామి వారి ఆలయానికి చెందిన స్థలాల్లో బోర్డులు ఏర్పాటు చేశారు.

మున్సిపల్ అధికారులకు షాక్

పట్టణానికి చెందిన జమిందార్ కుటుంబీకుల నుంచి కొనుగోలు చేసిన వెంకటేశ్వరా డీలక్స్ స్థలాన్ని ఇటీవల మున్సిపల్ అధికారులు కొనుగోలుదారుల పేరిట మ్యుటేషన్ చేశారు. ఆ స్థలం మ్యుటేషన్ చేయొద్దని అటు దేవాదాయ శాఖ అధికారులు, ఇటు జమిందార్ కుటుంబానికి చెందిన శ్రీ రాజా గౌరీదేవి అభ్యంతరాలు వ్యక్తం చేసినా అధికారులు మ్యుటేషన్ చేసేశారు. కోర్టు ఉత్తర్వులు సాకుగా చూపించి అధికారులు మ్యుటేషన్ చేశారు. 8 వారాల్లో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం మున్సిపల్ అధికారులు ఇరువర్గాలను విచారణ జరిపి ఫిర్యాదుదారుల అభ్యంతరాలు పరిగణనలోకి తీసుకోకుండా పని కానిచ్చేశారు. ఈ వ్యవహారంలో పట్టణానికి చెందిన వైసిపి కీలక నేత చక్రం తిప్పి కొనుగోలుదారుల పేరిట మ్యుటేషన్ చేయించారనే ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారంలో లక్షలాది రూపాయలు చేతులు మారాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే శుక్రవారం దేవాదాయ శాఖ ఇఒ వెంకటేశ్వరా డీలక్స్ స్థలం తమదేనని నోటీసు బోర్డు పెట్టారు. ఆ స్థలం ఆక్రమణదారులు శిక్షార్హులని నోటీసులో పేర్కొన్నారు. దేవాదాయ శాఖ అధికారులు చేసిన అభ్యంతరాలను పక్కన పెట్టిన మున్సిపల్ అధికారులు లక్షల్లో ముడుపులు తీసుకుని మ్యుటేషన్ చేశారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో దేవాదాయ శాఖ అధికారులు ఒక అడుగు ముందుకేసి ఆ స్థలంలో నోటీసు బోర్డు ఏర్పాటు చేయడం మున్సిపల్ అధికారులకు షాక్ లా పరిణమించే అవకాశం ఉంది. దేవాదాయ శాఖ ఆస్తి అంటే ప్రభుత్వ ఆస్తిగా పరిగణించి దాన్ని కాపాడడానికి ప్రయత్నించాల్సిన మున్సిపల్ అధికారులు కొనుగోలుదారులతో కుమ్మక్కవ్వడం చర్చనీయాంశమవుతోంది. ఈ వివాదం ఇప్పుడు దేవాదాయ శాఖ, మున్సిపల్ శాఖల మధ్య చిచ్చు రేపే పరిస్థితి కనిపిస్తోంది. ఇదిలా వుండగా రేకుల షెడ్ స్థలాన్ని కూడా కొనుగోలుదారుల పేరిట మ్యుటేషన్ చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆస్తులను రక్షించడంలో ప్రభుత్వ అధికారులే ఉదాసీనంగా వ్యవహరించడం వల్ల ఆస్తులు సులువుగా అన్యాక్రాంతమవుతున్న పరిస్థితి ఏర్పడింది. దేవాదాయ ఆస్తుల రక్షణ కోసం ఉన్నత న్యాయస్థానాలు తీర్పులిచ్చినా వాటిని అమలు చేయడం లో ప్రభుత్వ యంత్రాంగం ఘోరం విఫలమవుతోందన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేస్తున్న దేవాదాయశాఖ సిబ్బంది

పట్టణ ప్రధానరహదారిలో కాలువలపై నిర్మించిన దుకాణాలు

అక్రమ నిర్మాణాలతో మూసుకుపోతున్న కాలువలు

కరువైన అధికారుల పర్యవేక్షణ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని పలు వార్డుల్లో ఉన్న కాలువల పక్కనే ఆనుకొని ఉన్న స్థలాల్లో సంబంధిత యజమానులు భవన నిర్మాణాలు చేస్తూ మున్సిపల్ కాలువలను మూసి వేస్తున్నారు. అక్రమ నిర్మాణాలు చేస్తున్నా సంబంధిత వార్డు, సచివాలయాల ప్లానింగ్ సెక్రటరీలు గానీ, మునిసిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులుగాని పట్టించుకోకపోవడంతో యజమానులు బరితెగించి కాలువలపై పలకలను వేస్తూ, మెట్లను కడుతూ, రేకుల షెడ్డులు వేస్తూ ఆక్రమిస్తున్నారు. దీంతో కాలువల్లో పారిశుధ్య నిర్వహణ నిర్వహణ పనులు చేయడానికి వీల్లేకుండా పోయింది. కాలువలు సైతం కనబడకుండా కప్పేస్తూ అక్రమ నిర్మాణాలకు ఒడిగడుతున్నారు. అసలే పట్టణంలో అంతంత మాత్రం గానే పారిశుధ్య నిర్వహణ పనులు జరుగుతున్నాయి. దీనికి తోడు అక్రమ నిర్మాణాల కారణంగా కాలువల్లో పూడికలు పేరుకుపోవడంతో ప్రజారోగ్యం సిబ్బందికి వీటిని తొలగించేందుకు అవకాశం కూడా లేకపోతోంది. భారీ వర్షాలు కురిసే క్రమంలో వర్షం నీరు కాలువల్లోకి వెళ్లేందుకు అవకాశం లేక పోవడంతో వర్షం నీరు రోడ్లపైనే నిలిచే సందర్భాలు కూడా ఉన్నాయి. దీనివల్ల ఆయా ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం కలిగి ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. ఈ అక్రమ నిర్మాణాలు సంబంధిత భవన యజమానులు చేస్తున్న సమయంలో మున్సిపల్ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, ఆయా సచివాలయాల ప్లానింగ్ సెక్రటరీలు కానీ, ప్రజారోగ్య విభాగం అధికారులు నిర్మాణాలు జరుగుతున్న సందర్భంలోనే పట్టించుకోకపోవడంతో పలువురు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ కాలువలపై జరుగుతున్న అక్రమ నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటిని తొలగించేందుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మిమ్స్ పోరాటంలో ఏడుగురు నాయకులు అరెస్టు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

సమస్యలు పరిష్కరించాలని సుదీర్ఘకాలంగా ఆందోళన చేస్తున్న మిమ్స్ పోరాటంపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. 62రోజులుగా సమ్మె చేస్తున్నా యాజమాన్యం గాని, అధికారులు గాని స్పందించకపోవడంతో కడుపు మండిన ఉద్యోగులు మిమ్స్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్సు యూనియన్ ఆధ్వర్యాన ఈనెల 2న విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద రహదారిపై బైఠాయించారు. తాజాగా శుక్రవారం మిమ్స్ హెచ్‌ఆర్ ఇంటి ముందు ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో సిఐటియు రాష్ట్ర నాయకులు టివి రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్‌తో పాటు మిమ్స్ ఉద్యోగులు ఎం.నారాయణరావు, కె.మధు, ఎం.రాంబాబు, పి.గౌరి, పి.ఈశ్వరమ్మను నెల్లిమర్ల పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో ఐదుగుర్ని పూసపాటిరేగ స్టేషన్‌కు తరలించగా, ముగ్గురిని విజయనగరం టూ టౌన్ స్టేషన్‌లో ఉంచారు.

పలుచోట్ల జగ్జీవన్‌రాం జయంతి

ప్రజాశక్తి పార్వతీపురం టౌన్

భారత అమూల్య రత్న జగ్జీవన్ రామ్ అంటరాని వారి శ్రేయస్సు కోసం తన జీవితాన్ని అంకితం చేసిన దళిత చిహ్నమని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. శుక్రవారం జగ్జీవన్‌రామ్ 117వ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని ప్రధాన రహదారిపై గల జగ్జీవన్ రామ్ విగ్రహానికి ప్రజా ప్రతినిధులు, దళిత సంఘాల నాయకులు, ఉద్యోగులతో కలిసి ఘనంగా నివాళులు అర్పించి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 33ఏళ్లకు పైగా కేంద్ర కేబినెట్ మంత్రిగా, దేశ ఉప ప్రధాన మంత్రిగానూ డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ తీసుకున్న అసంఖ్యాక నిర్ణయాలు, దేశంలోని పేదలు, శ్రామిక ప్రజలు, సగటు మనుషులు, వెనుకబడిన వర్గాలు, ముఖ్యంగా షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వారి హక్కులు, అభివృద్ధికి జగ్జీవన్‌రామ్ తీవ్రంగా కృషి చేశారన్నారు. కార్యక్రమంలో పట్టణ వైసిపి అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, జెసిఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, స్టేట్ డైరెక్టర్ జాన్నాడ శ్రీదేవి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు సర్విశెట్టి శ్రీనివాసరావు, మాదిగ ఫెడరేషన్ సంఘం సభ్యులు, వివిధ వార్డుల కౌన్సిలర్లు, సర్పంచ్లు, వైసిపి సీనియర్ నాయకులు, దళిత సంఘాల నాయకులు, జిల్లా మాదిగ సమైక్య సంఘం సభ్యులు, జెఎసి సభ్యులు, స్థానిక ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పార్వతీపురంలో జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాల వేస్తున్న టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి విజయచంద్ర; వీరఘట్టంలో నివాళ్లు అర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు

జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

వీరఘట్టం : భారత తొలి దళిత ఉప ప్రధాని బాబు జగజ్జీవన్ రామ్ జయంతి వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని బాబు జగజ్జీవన్ రామ్ కాలనీలో బాబు జగజ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా దళిత నాయకులు ఎ.రాంకుమార్, ఎన్.జాకబ్ దయానంద్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్.శశిభూషణరావు, ఎన్.కల్యాణ్, ఎన్‌కె ప్రసాద్, ఎన్‌వి భాస్కరరావు, కె.పైడిరాజు, ఎన్ రిషి రోషన్, వి.ప్రశాంత్, జి.రామకృష్ణ, బి.అశోక్, వి.నెల్సన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : ప్రజాసేవకుడు జగ్జీవన్‌రామ్ మహోన్నత నాయకత్వం, వ్యక్తిత్వం, సేవ భావంభారతదేశ ప్రజాస్వామిక వ్యవస్థకు, సంస్థకు మహాబలాన్ని చేకూర్చిపెట్టాయని దళిత సీనియర్ నాయకులు భోగి జేమ్స్ కుమార్ అన్నారు. పట్టణంలోని కస్పా వీధిలో జరిగిన డాక్టర్ బాబు జగజీవన్‌రావు 177వ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్రశ్రేణి నాయకుల్లో ఒకరని,భారత స్వాతంత్ర్య ఉద్యమం లోనూ, నవభారత నిర్మాణంలో ఉదాత్తమైన పాత్ర నిర్వహించిన బాబూ జగ్జీవన్ రామ్, చదువుకునే రోజుల్లో దళితుల సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారన్నారు. సమాజం దళిత జాతుల పట్ల అవలంభించే అంటరానితనం, వారికీ జరిగే అన్యాయాలకు, వ్యతిరేకంగా పోరాడారన్నారు. కార్యక్రమంలో దళిత యువ నాయకులు ఎందవ మరియాదాసు, పకీరు, భోగి దాసు, శ్రీదేవి, పారమ్మ, చిన్నమ్ముడు, మహిళలు, యువకులు పిల్లలు పాల్గొన్నారు.

నీళ్లు లేక ఒట్టిపోయిన వట్టిగెడ్డ

ఒట్టిపోయిన వట్టిగెడ్డ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని ఒట్టిగడ్డ ఒట్టిపోయింది. ప్రస్తుతం ఎండలు అధికంగా ఉండడం వల్ల పైనుంచి గడ్డిలోకి నీరు రాకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. దీంతో మండల కేంద్రంలోని రక్షిత మంచినీటి పథకం ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. గ్రామంలో సుమారు 4000 పై చిలుక కుటుంబాలు రక్షిత మంచి నీటి పథకంపై ఆధారపడి కాలం వెళ్లదీస్తున్నారు. రోజురోజుకీ భానుడు తన ప్రతాపం చూపడంతో భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో గ్రామ ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు.

కొటియా పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన సిఎస్

ప్రజాశక్తి - సాలూరు

వివాదాస్పద కొటియా గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఒడిశా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ జెన్నా శుక్రవారం పరిశీలించారు. పట్టు చెన్నూరు, ముడకారు పోలింగ్ కేంద్రా ను ఆయన జిల్లా కలెక్టర్ వి.కీర్తివాసన్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం కొటియా గ్రామాల్లో సాగు చేస్తున్న స్ట్రాబెర్రీ పంటను ఒడిశా వ్యవసాయ శాఖ కార్యదర్శి అరవింద్ పాడీతో పరిశీలించారు. సాగు చేస్తున్న రైతులతో మాట్లాడారు. వారి వెంట కొరాపుట్ జిల్లా ఎస్పీ అవినాష్ వున్నారు.

వృద్ధులను ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే కళావతి

జోరుగా ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పుబ్బాడ, దోనుబాయి, కె. వీరఘట్టం, చిన్నపల్లకి పంచాయతీల్లో పాలకొండ ఎమ్మెల్యే వి.కళావతి ఎన్నికల ప్రచారం శుక్రవారం ముమ్మరం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు నేరుగా సంక్షేమ ఫలాలు అందాలంటే మళ్లీ జగన్ మోహన్ రెడ్డిని గెలిపించాలని కోరారు.

మండలంలో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం ప్రారంభం

కురుపాం : మండలంలోని బియ్యాలవలస, సింగు పురం, గొందిలోవ, గొందిలోవ కాలనీ, గుజ్జుపాడు, గోళ్ళవలస, కిచ్చాడ, రామకృష్ణాపురం, పట్టాయిదొరవలస, వెంకటాపురం గ్రామాల్లో శుక్రవారం ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైసిపి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు గూర్చి ఇంటింటికీ వెళ్లి వివరించి రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీరాములునాయుడు భౌతికదేహాన్ని సందర్శిస్తున్న రాజన్నదొర (ఇట్‌సెట్‌లో మృతుడు)

విఆర్‌ఒ శ్రీరాములు నాయుడు మృతి

ప్రజాశక్తి - సాలూరు

మండలం లోని పట్టణం, పలు గ్రామాలకు చెందిన విఆర్‌ఒ గొర్జి శ్రీరాములు నాయుడు (56) గురువారం రాత్రి మృతి చెందారు. ఆయన తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో విజయనగరంలోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. గతంలో ఆయన గుండెపోటుకు గురయ్యారు. పాచిపెంట, రామభద్రపురం, సాలూరు మండలాల్లో పని చేశారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. శ్రీరాములునాయుడు మృతికి మండల తహశీల్దార్ ఎ.సింహాచలం, కార్యాలయం సిబ్బంది, విఆర్‌ఒలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. డిప్యూటీ సిఎం రాజన్నదొర, వైసిపి నాయకులు ఆయన నివాసానికి వెళ్లి నివాళు లర్పించారు.

పాచిపెంట మండలం పనుకువలసలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

వీరఘట్టంలో పోలీస్ కవాతు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని శుక్రవారం పోలీస్ కవాత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలగ, కూరాకుల, బాబు జగ్జీవన్ రామ్ కాలనీ, గెడ్డ కాలనీ, కస్పావీధి, తదితర వీధులతో పాటు ప్రధాన రహదారిలో పోలీస్ కవాత్ నిర్వహించారు. ఎన్నికల్లో తమ ఓటును ప్రశాంతంగా వేసుకోవచ్చునని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు కార్యక్రమం ఈ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ ఎస్‌కె ఫక్రుద్దీన్, పారా పోలీసులు బలగాలు పాల్గొన్నాయి.

పాచిపెంట: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మండలంలోని పనుకువలస పంచాయతీలో గల కందిరివలస, గుంటమామిడివలస, కోస్టువలస తదితర గ్రామాల్లో స్థానిక ఎస్సై పి నారాయణ రావు ఆధ్వర్యంలో పోలీస్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ఎన్నికలు సజావుగా జరిగేందుకు భద్రతాపరంగా పోలీసులు ముందస్తు చర్యలో భాగంగా మండలంలో ప్రతి గ్రామంలో పోలీస్ కవాతు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని మామిడిపల్లిలో ఉన్న 33 కెవి సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ కారణంగా ఉదయం ఐదు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఎపిఇపిడిసిఎల్ డిఇ (ఆపరేషన్)కిశోర్ ఒక ప్రకటనలో తెలిపారు. మామిడిపల్లి, గంగన్నదొరవలస సబ్ స్టేషన్‌ల పరిధిలో ఉన్న గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని డిఇ కిశోర్ ఆ ప్రకటనలో తెలిపారు.

మొక్కలకు రక్షణగా దోమతెరలు

ప్రజాశక్తి - కొమరాడ

మొక్కలకు రక్షణగా కప్పిన దోమతెరలు

ఏజెన్సీ ప్రాంతాల్లో మలేరియా, డెంగీ, విష జ్వరాల బారిన పడకుండా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నా, అవి క్షేత్రస్థాయిలో అమలు కావడంలేదని స్పష్టంగా అర్థమవుతుంది. గిరిజనులకు దోమల వల్ల విష జ్వరాలు వ్యాపించకుండా ఉండేందుకు ప్రతి ఇంటికి అవసరమైన దోమతెరలను ప్రభుత్వం ఇప్పటికే పంపిణీ చేసింది. దోమ తెరల వినియోగంపై వైద్య శాఖ అధికారులు పూర్తిగా చేతులెత్తియడంతో దోమతెరలను పంట పొలాల్లో వేసుకుని మొక్కలకు రక్షణగా గిరిజనులు ఏర్పాటు చేసుకునే దయనీయ పరిస్థితి మండలంలో జరుగుతుంది. మండలంలోని మసిమండ సమీపంలో గల పంట పొలాల్లో చెట్లకు రక్షణగా దోమతెరలను వినియోగించుకోవడం చూస్తే వైద్యశాఖ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందని పలువురు ప్రజాప్రతి నిధులు అంటున్నారు. మసి మండ నుంచి కప్పలాడ వెళ్లే గ్రామాల రహదారి పక్కనే ఉన్న మెట్టి ప్రాంతంలో దోమతెరలు విచిత్రంగా చెట్లకు రక్షణగా వేసిన దృశ్యం 'ప్రజాశక్తి' కంటపడింది. ముఖ్యంగా ఎన్నో లక్షల రూపాయలు వేయడంతో జ్వరాలు బారిన గెలిచిన ప్రజలు పడకుండా ఉండేందుకు రాష్ట్ర వైద్య శాఖ అనేక ప్రయత్నాలు చేస్తుంటే అవి అధికారులు నిర్లక్ష్యానికి తూట్లు పొడిచేలా ఉన్నాయని పలువురు అంటున్నారు. దాదాపు 30 దోమతెరలను చెట్లకు రక్షణగా గిరిజనులు ఏర్పాటు చేసుకున్నారు. దోమతెరలు వినియోగంపై గిరిజనులకు ఎటువంటి అవగాహన కల్పించక పోవడం వల్లే వారు ఇలా వీటిని చెట్లకు వినియోగిస్తున్నారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం జ్వరాలు నివారణకు చేపడుతున్న చర్యలపై పూర్తిస్థాయిలో గిరిజనులకు వైద్యశాఖ అధికారులు సిబ్బంది అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉందని పలువురు ప్రజాప్రతినిధులు అంటున్నారు.

నేలకొరిగిన బద్దలైన వాటర్ ట్యాంక్

వాడజంగిలో నేలకొరిగిన వాటర్ ట్యాంక్

- కటకటలాడుతున్న గిరిజనులు
- గెడ్డనీరే గతి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని మారుమూల పంచాయతీ అయిన బీరుపాడు పంచాయతీ వాడజంగిలో గల వాటర్ ట్యాంక్ నాలుగు రోజుల క్రితం గాలికి కిందకు పడిపోయింది. దీంతో వాటర్ ట్యాంకు పూర్తిగా పనికిరాకుండా బద్దలైపోయింది. దీంతో చేసేదేమీ లేక గిరిజనులు గ్రామానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న గెడ్డ నీటిని వాడుతున్నారు. ఇదిలా ఉండగా బీరుపాడు సర్పంచ్ కళావతికి ఈ విషయమై గ్రామస్తులు సమాచారం అందించగా, తాను ఏమీ చేయలేనని గెడ్డ నీటినే వాడుకోవాలని సలహా అందించారని గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామంలో సుమారు 60 వరకు కుటుంబాలు నివసిస్తుండగా ఒకే ఒక మంచినీటి ట్యాంకు ఉందని, ఇది కూడా గ్రామంలో వీచిన గాలికి కింద పడిపోయి బద్దలైపోయిందని గ్రామస్తులు వాపోతున్నారు. తమకు ఎలాగైనా మంచినీటి ట్యాంక్‌ను మంజూరు చేసి గ్రామస్తులకు తాగునీటి సదుపాయాన్ని కల్పించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు. ఈ విషయమై ఎంపిడిఒ జగదీష్ కుమార్‌కు సమాచారం ఇవ్వగా తక్షణమే ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులకు పంపించి మంచినీటి ట్యాంకును మరమ్మతులు చేయించి గ్రామస్తులకు తాగునీరందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

మళ్లీ వస్తున్నా... ఆదరించండి

ప్రజాశక్తి - మక్కువ

మక్కువ మండలం కాశీపట్నంలో ప్రచారం చేస్తున్న టిడిపి అభ్యర్థి సంధ్యారాణి

టిడిపి అభ్యర్థిగా మళ్లీ సాలూరు నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న తనను ఈసారైనా ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపించాలని మహిళలను టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మడి సంధ్యారాణి అభ్యర్థించారు. మండలంలోని కాశీపట్నం పంచాయతీలో శుక్రవారం ఇంటింటి ప్రచారంలో భాగంగా టిడిపి మండల పార్టీ అధ్యక్షులు జి.వేణుగోపాలనాయుడు ఆధ్వర్యంలో గుమ్మడి సంధ్యారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాయిరాం కాలనీ మహిళలు తాగునీటి సమస్యపై ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి అధికారంలోకి వచ్చాక తాగునీటి సమస్య లేకుండా పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : మండలంలోని వెంకంపేటలో శుక్రవారం బాబు షూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా కూటమి అభ్యర్థి బోనెల విజయచంద్ర వెంకంపేట గ్రామంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. టిడిపి, జనసేన, బిజెపి నాయకులు ఇంటింటికి వెళ్లి మానిఫెస్టో అంశాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడిగా పోరాడుదాం... కష్టపడి విజయ ఢంకా మోగిస్తాం అని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, జాగాన రవికుమార్, బోను చంద్రమౌళి, గురజాన చంద్రమౌళి, బుడితి శ్రీరామ్, జనసేన మండల కన్వీనర్ ఆగూరు మణి, పరిసర్ల అప్పారావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెట్ల కొమ్మలు తొలగింపు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

విద్యుత్ మరమ్మతు పనులు చేస్తున్న సిబ్బంది

పార్వతీపురం నుంచి గరుగుబిల్లి మండల కేంద్రానికి విద్యుత్తు సరఫరా చేసే 33 కెవి లైన్ పరిధిలో విద్యుత్తు లైన్లకు ఆనుకుని ఉన్న చెట్లు కొమ్మలను తొలగించేందుకు అధికారులు శుక్రవారం చర్యలు చేపట్టారు. ఈమేరకు విద్యుత్తు లైన్ల పరిధిలో చెట్లు కొమ్మలు తొలగించడంతో ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్తు సరఫరాను నిలిపివేశామని ఎఇ బొంతాడ శంకరరావు తెలిపారు. విద్యుత్తులైన్ల పరిధిలో చెట్లు కొమ్మలను తొలగించని యెడల గాలులు వీచే సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉన్నందున కొమ్మలను తొలగించేందుకు చర్యలు చేపట్టామన్నారు. గరుగుబిల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని ఆయా గ్రామాలకు విద్యుత్తు సరఫరా చేసే విద్యుత్తు లైన్లు పరిధిలో ఉన్న చెట్లు కొమ్మలను తొలగించామని ఎఇ తెలిపారు.

వేసవిలో ఆయుర్వేదంతో ఉపశమనం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ప్రస్తుత వేసవిలో వడదెబ్బకు గురికాకుండా ఆయుర్వేదంతో మంచి ఉపశమనం కలుగుతుందని ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ తెర్లి హేమాక్షి అన్నారు.ఇటీవల పిహెచ్‌సిని సందర్శించిన ఆమె పలు సూచనలు చేశారు. ప్రస్తుతం వేసవిలో బయట ఉష్ణోగ్రతలు రోజు రోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ఇందుకు అనుగుణంగా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకుంటే వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని అన్నారు. అలాగే శరీరం నీటి శాతాన్ని కోల్పోతుందన్నారు. వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు ఆయుర్వేద ఔషధాలు ఇంటివద్దే చేసుకోగలిగే కొన్ని ఆయుర్వేద చిట్కాలుతో ఉపశమనం పొందవచ్చన్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- సబ్జాగింజలు నానబెట్టి, నిమ్మరసం కలిపి అందులో కొంచెం కండ శర్కర వేసి తాగాలి.
- మజ్జిగలో జీలకర్ర పొడి చిటికెడు, కొంచం బ్లాక్ ఉప్పు కలిపి తీసుకోవాలి.
- వట్టివేరు(ఉశీర)పొడిచేసి అందులో కొద్దిగా దనియాల పొడి కలిపి కషాయం కాచి, - కండశర్కర కలిపి తాగాలి.
- శతావరి (పిల్లి పీచర) వేర్లు పొడి పాలలో కలిపి తీసుకోవచ్చు.
- అతి మధురం అర చెంచా ఒక గ్లాసు నీటిలో కలిపి తాగాలి. మధు మేహం ఉన్నవారు బెల్లం కాని, తాటి బెల్లం కాని ఉపయోగించవచ్చు.
- ఉసిరిక పౌడర్‌లో గుంటగలగర ఆకు, పెరుగు కలిపి తలకి పట్టించి గంట తర్వాత స్నానం చేయాలి.
- దోసకాయ రసం ముఖం, చర్మంపై పూతగా వేసుకున్న ఎండకి పొడి బారకుండా ఉంటుంది.

ఆహారం విషయానికి వస్తే ఈ వేసవిలో ఎక్కువగా శాఖాహారం తీసుకోవాలని సూచిం చారు. తాజా ఆకుకూరలు, కీర దోస, పుచ్చకాయ వంటి నీటి శాతం అధికంగా ఉండే వాటిని తీసుకోవాలన్నారు. వేపుడు పదార్థాలు, నూనె వంటలు బాగా తగ్గించుకోవాలి. పిల్లలను బయట ఫాస్ట్ ఫుడ్స్,చిరు తినుబండారాలకు సాధ్యమై నంత దూరంగా ఉంచాలని హితవు పలికారు. కాటన్, లేత రంగు, తేలిక పాటి దుస్తులు ధరించా లన్నారు. ఆసుపత్రిలో ఆయుర్వేద ఔషధాలు చందనాసవ, ఉశీరాసవ, ధాన్య పంచక కషా యం, షడంగ పానీయం మొదలగునవి వేసవి తాపానికి ఉపశమనం కలిగిస్తాయని అన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ వైద్యుల సూచ నలు పాటిస్తూ ఎండ తీవ్రతకు గురికా కుండా జాగ్రత్తలు పాటించాలని ఆమె కోరారు.

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - కొమరాడ

ఓటు వినియోగంపై గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నీలకంఠం

మారుమూల గిరిజన ప్రాంతాల్లో ఉండే గిరిజనులు తమ ఓటు హక్కులను స్వేచ్ఛగా వినియోగించుకోవాలని స్థానిక ఎస్సై నీలకంఠం అన్నారు. శుక్రవారం గిరిశిఖర గ్రామమైన నయా గ్రామాన్ని, పోలింగ్ కేంద్రాన్ని పోలీసులు సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్సై నీలకంఠం గిరిజనులతో మాట్లాడుతూ తమకున్న ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకొనేలా గిరిజనులకు అవగాహన కల్పించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ముఖ్యంగా ఎన్నికల సమయంలో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు గిరిజనుల సహకారం ఎంతో అవసరమని అన్నారు. తమకు నచ్చిన వారికి ఓటు హక్కును వినియోగించుకొనేలా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి పోలింగ్ కేంద్రం వద్ద ఎటువంటి సదుపాయాలు ఉన్నాయి లేదా అని ఆరా తీశారు. ఎన్నికల సమయంలో గిరిజనులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గిరిజనులకు వివరించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ గొల్లయ్య, గిరిజనులు ఉన్నారు.

నేరాలు ఘోరాలు

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని కృష్ణపల్లి పంచాయతీ పరిధిలోని రాధంపేట సమీపం మామిడితోటలో గుర్తు తెలియని పురుషుని శవం లభించింది. పంచాయతీ సిబ్బంది ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై దినకర్ శవాన్ని మార్చురీకి తరలించారు. వ్యక్తి గురించి ఎవరైనా సమాచారం తెలపాలని లేదంటే పార్వతీపురం రూరల్ పోలీస్ స్టేషన్లో సంప్రదించాలన్నారు.

దగ్ధమవుతున్న గడ్డి వాములు

శివినిలో 20 ఎకరాల గడ్డి కుప్పలు దగ్ధం

ప్రజాశక్తి - కొమరాడ

గ్రామానికి చెందిన రైతుల గడ్డి కుప్పలు అగ్ని ప్రమాదంలో దగ్ధమైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని శివునిలో గ్రామానికి చెందిన ఐదు మంది రైతులు 20 ఎకరాల గడ్డికుప్పలు శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో కాలి బూడిదయ్యాయి. రోడ్డు పక్కనే ఉన్న గడ్డికుప్పల్లో ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో గమనించిన స్థానికులు పార్వతీపురం అగ్నిమాప కార్యాలయానికి సమాచారం అందజేశారు. విషయం తెలుసుకున్న అగ్నిమాపకేంద్రం సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలాన్ని చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అయినప్పటికీ ఈ అగ్ని ప్రమాదంలో సుమారు 20 ఎకరాలకు పైగా గడ్డివాములు కాలి బూడిదైనట్లు గ్రామానికి చెందిన అధికారి మోహనరావు, వెంకటరమణ, బంగారు నాయుడు, సత్యం నాయుడు, అప్పలస్వామి రైతులు చెబుతున్నారు. ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగాయా లేక ఎవరైనా కావాలనే అగ్గి మంటలు పెట్టారని అనుమానంలో రైతులు ఉన్నారు. ఏది ఏమైనా తమ పశువుల మీద కోసం ఉంచుకున్న గడ్డి మొత్తం కాలిబూడదవ్వడంతో రైతులు కన్నీరు మున్నీరై వాపోతున్నారు.